క్లుప్తంగా

విద్యార్థుల నాటక ప్రదర్శన



గాంధారి(ఎల్లారెడ్డి) : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం సప్తాహం ఘనంగా నిర్వహించినట్లు హెచ్ఎం వెంకటేశ్వర్ గౌడ్ తెలిపారు. మన దేశ సంస్కృతి భిన్నత్వంలో ఏకత్వం ప్రతిబింబించేలా వివిధ మతాలకు సంబంధించిన వేషధారణలో నాటక ప్రదర్శలు, నృత్య ప్రదర్శనలు చేశారు.

'పలారం బండి' కార్యక్రమానికి రావాలని ఆహ్వానం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డిలో బోనాల పండుగ సందర్భంగా నిర్వహించే పలారం బండి కార్యక్రమానికి రావాలని కోరుతూ మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ గురువారం ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుకు ఆహ్వాన పత్రికను అందించారు. ఆదివారం ఎల్లారెడ్డిలో నిర్వహించే బోనాల పండగకు హాజరుకావాలన్నారు.

బోనాల పండుగకు ఆహ్వానం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యాల పోచమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం నిర్వహించే బోనాల పండగకు హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు ఆహ్వాన పత్రికను అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు వినోద్, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు తిరుపతి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశం తదితరులున్నారు.

కుక్కల తరలింపు



సాక్షి ఎఫెక్ట్..

మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలో గురువారం ఊర్లో తిరుగుతున్న వీధి కుక్కలను స్పెషల్ టీం సభ్యులు పట్టుకున్నారు. ఈనెల 20న 'సాక్షి'లో ప్రచురితమైన 'కుక్కలతో భయం భయంగా..' అనే వార్తకు మద్నూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్ స్పందించారు. వేకువజామున వచ్చిన ప్రత్యేక సిబ్బంది ఆయా కాలనీల్లో తిరుగుతున్న కుక్కలను పట్టుకుని వాహనాల్లో తరలించారు. పంచాయతీ అధికారులు స్పందించి స్పెషల్ టీం సాయంతో గ్రామంలో ఉన్న కుక్కలను తరలించారు.

డిగ్రీ ఫలితాల్లో పీజేఆర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



తేజ



రమ్య



శ్రవణ్‌కుమార్

కామారెడ్డి రూరల్ : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో విడుదల చేసిన రెండవ, నాల్గో సెమిస్టర్ ఫలితాల్లో పీజేఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలను సాధించి ప్రభంజనం సృష్టించారని కళాశాల చైర్మన్ గురువేందర్ రెడ్డి అన్నారు. సెకండ్ సెమిస్టర్ తేజ బీకాం (సీఏ) 9.72 జీపీఏతో పాటు నాల్గో సెమిస్టర్‌లో శ్రవణ్ కుమార్ బీజెడ్సీలో 9.72 జీపీఏతో యూనివర్సిటీ స్థాయిలో ర్యాంకులు సాధించారన్నారు. సెకండ్ సెమిలో రమ్య ఎంపీసీలో 9.64 జీపీఏ సాధించిందని, ఇతర విద్యార్థులు 9.0 జీపీఏకి పైగా 50 మంది విద్యార్థులు జీపీఏ సాధించారన్నారు. పీజేఈఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎం కృష్ణ ప్రసాద్‌గౌడ్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



భిక్కనూరు : మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన అవయవదానం చేసిన మెట్టు ప్రవీన్ కుటుంబానికి కంచర్ల -పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన పలువురు యువకులు గురువారం ఆర్థికసాయం చేశారు. ఈ రెండు గ్రామాలకు చెందిన పలువురు యువకులు రూ. 13,500 ప్రవీణ్ భార్య రేఖకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేజీషియన్ సంతోష్, సురేష్‌రెడ్డి, రవి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

మూగ జీవాలకు రక్షణేది?

- ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు కరువు
- విద్యుత్ షాక్‌తో జిల్లాలో వారం రోజుల్లో ఆరు జీవాలు మృత్యువాత



నస్రుల్లాబాద్ ఎంపీడీవో కార్యాలయం వద్ద కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్



సంగంలో పాఠశాల ఎదుట ప్రధాన రహదారి పక్కన కంచె లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మూగజీవాలకు రక్షణ లేకుండా పోయింది. విద్యుత్ శాఖ చేస్తున్న తప్పిదాల కారణంగా మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏరపాటు చేయకపోవడంతో చిన్నారులు సైతం ప్రమాదాల బారిన పడతారని తెలిసినా విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తోంది. నస్రుల్లాబాద్ మండలంలోని సంగం గ్రామంలో ప్రాథమిక పాఠశాలకు ఆనుకుని ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అది చేతికందేలా ఉన్నా ట్రాన్స్‌కో స్పందించట్లేదు. నెమ్లి షిర్డీ సాయి ఆలయం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ కూడా చేతికందేలా ఉంది. దీనిపై అధికారులు నిర్లక్ష్యం చేయడంతో ఈ నెల 17న నెమ్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి చెందిన మూడు ఆవులు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి చనిపోయాయి. అతనికి అధికారులు నష్ట పరిహారం అందిస్తామంటూ ఉన్నతాధికారుల సలహాలతో ఇన్సూరెన్స్ ఇప్పిస్తున్నట్లు సమాచారం అలాగే మండలవ్యాప్తంగా మిర్జాపూర్ గ్రామంలో, అంకోల్ తండా కిరాణం ముందు, అంకోల్‌లో అంగన్‌వాడీ కేంద్రం ముందు కూడా ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి.

నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో..

గిరిజన గురులకు బాలుర పాఠశాల ఎదుట, ఎంపీడీవో ఆఫీస్ ఎదుట, మార్కెట్‌కు వెళ్లే దారిలో, చౌక ధరల దుకాణం వద్ద ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్నాయి. మైలారం-తిమ్మాపూర్ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్నాయి. ఇవన్నీ రక్షణ లేకుండా ఉన్నాయి.

ఇటీవల జరిగిన ఘటనలు

- ఈనెల 22న కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలం జల్ది పల్లి గ్రామ శివాలో తిగుల హన్మంతుకు చెందిన గేదె విద్యుత్ నియంత్రికకు తగిలి చనిపోవడంతో రూ.50వేల వరకు నష్టం జరిగింది.
- ఈనెల 18న మాక్లూర్ మండలండం గొట్టి ముక్కుల గ్రామానికి చెందిన గొల్ల మహేష్‌కు చెందిన గేదె చనిపోవడంతో రూ.1 లక్ష నష్టం జరిగింది.
- ఈనెల 17న నెమ్లి గ్రామం ఒకే వ్యక్తికి చెందిన మూడు ఆవులు ట్రాన్స్‌ఫార్మర్ కు కంచె లేకపోవడం వలనే చనిపోయాయి.

నివేదికలు పంపాం..

ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న చోట కంచెలు ఏర్పాటుకు ఉన్నతాధికారులకు నివేదికలను పంపించాం. ఆదేశాలు రాగానే పనులు చేపడుతాం. రైతులు కూడా నియంత్రికల వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నాం. నెమ్లి బాధితుడికి ఇన్సూరెన్స్ వచ్చేలా చూస్తాం. – అర్వింద్, ఏఈ, నస్రుల్లాబాద్

పారిశుధ్యంపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలి



లింగంపేటలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీవో మలహరి



భిక్కనూరులో..



రాజంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని శెట్పల్లి, అయ్యపల్లి, అయ్యపల్లితండా, లింగంపేట తదితర గ్రామాల్లో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఎంపీవో మలహరి ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయితీల్లో సమావేశాలు ఏర్పాటు చేసి పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు.

భిక్కనూరు : ప్రజలందరికి పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలని ఎంపీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం భిక్కనూరు మండల కేంద్రంతో పాటు మోటాట్‌పల్లి, తిప్పాపూర్ గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పారిశుధ్య పనులను, దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. భిక్కనూరు ఈవో మహేశ్‌గౌడ్ ఉన్నారు.

రాజంపేట : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్న నేపథ్యంలో మండలంలోని అన్ని జీపీల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీపీవో శ్రీనివాస్, డీఎల్పీవో శ్రీనివాసులు సూచించారు. గురువారం రాజంపేట మండల కేంద్రాన్ని వారు ఆకస్మికంగా సందర్శించారు. వర్షంలోనూ పనులు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. సిబ్బందికి రెయిన్‌కోట్లు అందజేశారు. జీపీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి జీపీ కార్యదర్శి అశోక్‌కు సూచనలు అందజేశారు. ఎంపీడీవో రాజేశం, ఎంపీవో రఘురాం పాల్గొన్నారు.

నిజాంసాగర్(జుక్కల్) : గిరిజన తండాలతో పాటు మారుమూల గ్రామాలు, పంచాయతీల్లో సంపూర్ణ పారిశుధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు తగిన దృష్టి సారించాలని స్థానిక ఎంపీడీవో గంగాధర్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల పంచాయతీ కార్యదర్శి అనిత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ఆర్డీవో ప్రభాకర్



లింగంపేటలో మాట్లాడుతున్న అధికారి ప్రభుకిరణ్



మాచారెడ్డిలో మాట్లాడుతున్న దేవయ్య

ఎల్లారెడ్డి : ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలను తీసుకోవాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతు సీజనల్ వ్యాధులైన డయేరియా, టైఫాయిడ్, మలేరియా లాంటి వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలను తీసుకునేలా ప్రజలకు ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో మత్తమాల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్, ఎంపీవో ప్రకాష్ తదితరులున్నారు.

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రైవేటు, ప్రభుత్వ వైద్యులకు సీజనల్ వ్యాధులపై గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రభుకిరణ్ అవగాహన కల్పించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, చికున్ గున్యా తదితర వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరం వస్తే నిర్ధారణ కోసం పీఎంపీ, ఆర్ఎంపీలు ప్రభుత్వాస్పత్రికే పంపాలన్నారు. ఆయా గ్రామాల్లో టెమిఫాస్ మందు స్ప్రే చేయాలన్నారు. జిల్లా మాస్ మీడియా అధికారి వేణు, పద్మజ, ప్రోగ్రాం అధికారి హిమబిందు, ఎంపీవో మలహరి, సీహెచ్‌వో రమేశ్, యాదగిరి, శుభాష్, ఏఎన్ఎంలు తదితరులున్నారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి : కనీస వైద్య సౌకర్యాలు లేని మారుమూల పల్లెల్లో ప్రజలకు సేవలందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోషియేషన్ మండల అధ్యక్షుడు దేవయ్య సూచించారు. ఈ మేరకు గురువారం మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నృసింహాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆ సంఘం కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. అక్కడక్కడ దాడులు చేస్తూ ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను సీజ్ చేస్తున్న నేపథ్యంలో మన పరిధి దాటి వైద్యం చేయవద్దని దేవయ్య పేర్కొన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులు నిలిపి వేసి పారామెడికల్ శిక్షణను కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, టీ శంకర్, యూ శంకర్, బుచ్చిరెడ్డి,సత్యనారాయణ, దశరథం, సిద్ధిరాములు,నర్సింలు ఉన్నారు.

బహిరంగ మలవిసర్జన నిషేధం



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని గాలీపూర్ గ్రామ పంచాయతీలో బహిరంగ మల మూత్ర విసర్జనను నిషేధిస్తూ గురువారం గ్రామ సభలో గ్రామస్తులు తీర్మానించారు. జీపీ ప్రత్యేక అధికారిణి సుమలత ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ తీర్మానాన్ని గ్రామస్తులు అందరూ పాటించాలన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ గురువారం పరిశీలించారు. డ్రైనేజీ, తాగునీటి సమస్యలను డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఉంటున్న లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు, దోమల నివారణకు చర్యలు చేపడుతామని అధికారులతో చెప్పి పరిష్కరిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి ప్రాథమిక పాఠశాలలో తొమ్మిదేళ్లుగా పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గురువారం గ్రామ పెద్దలు, విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ అందించిన సేవలను కొనియాడారు. మాజీ సర్పంచ్ అనిల్‌రెడ్డి, హెచ్ఎం ఫణికుమార్, పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ లావణ్య, గ్రామ పెద్దలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు బదిలీ అయిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

కూలిన ఇళ్ల పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి) : నాలుగు రోజులుగా కురుస్తున్న ముసురుకు మండలంలోని గాంధీనగర్ గ్రామంలో గురువారం రెండు ఇళ్లు కూలినట్లు గ్రామస్తులు తెలిపారు. ఎల్లమ్మతండా జీపీ పరిధిలోని శేక్ ఇమాం, షేక్ కరీంకు చెందిన రెండు ఇల్లు పూర్తిగా కూలిపోయినట్లు తెలిపారు. వారికి గ్రామస్తులు ప్రత్యామ్నాయంగా మరో ఇంటికి తరలించారు. విషయాన్ని తెలుసుకున్న అధికారులు ఎంపీవో మలహరి, కార్యదర్శి మమత గాంధీనగర్‌కు చేరుకొని వివరాలు సేకరించి పంచనామా నిర్వహించారు. మాజీ సర్పంచ్ బీమారావు ఉన్నారు.

కార్యదర్శులు అందుబాటులో ఉండాలి



గాంధారిలో మాట్లాడుతున్న డీఎల్పీవో సురేందర్



పెద్దకొడప్‌గల్‌లో..



బీర్కూర్‌లో..

గాంధారి(ఎల్లారెడ్డి) : మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు స్థానికంగ అందుబాటులో ఉండాలని ఎల్లారెడ్డి డీఎల్పీవో సురేందర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎంపీవో లక్ష్మీనారాయణ, ఎంఈవో సేవులా, వైద్యాధికారి సాయికుమార్ తో కలిసి పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటుచేసి పలు సూచనలు చేశారు. రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీరు నిలువ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. ఫాగింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. శిథిలావస్థలో ఉన్న ఇల్లు గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూలిపోయే ప్రమాదాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దశరత్, ఎస్సై కోనా రెడ్డి, నూతన ఎంపీవో లక్ష్మీకాంత్ రెడ్డి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో..

బాన్సువాడ : వర్షాల నేపథ్యంలో ఆయా గ్రామాల్లో కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీలత సూచించారు. గురువారం బీర్కూర్ తహసీల్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. వర్షాలకు ఆయా గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండిపోయాడని, కట్టలపై నుంచి వర్షం నీళ్లు పొంగిపొర్లితే సమాచారం ఇవ్వాలన్నారు. పురాతన నివాసాల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుపరిండెంట్ భానుప్రకాష్ తదితరులు ఉన్నారు.

బదిలీలు చేపట్టాలని ఆందోళన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : పదకొండేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న తమను వెంటనే బదిలీ చేయాలని కోరుతూ నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని గోపాల్‌పేట మోడల్‌స్కూల్ సిబ్బంది గురువారం షార్ట్ బ్రేక్ సమయంలో ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే మోడల్‌స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత పీజీటీ, టీజీటీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

నిజాంసాగర్(జుక్కల్) : ఆదర్శ మోడల్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల బదిలీలు చేపట్టాలని కోరుతూ గురువారం అచ్చంపేట మోడల్ పాఠశాల ఆవరణలో టీచర్లు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ ఉపాధ్యాయులు, టీచర్లు ఉన్నారు.

పొలాల్లోకి చేరిన వర్షంనీరు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని వివిధ గ్రామాల్లో ఎడ తెగకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఐదురోజుల నుంచి ఎడ తెగకుండా వర్షం కురియడంతో పంటలు పండుతాయన్న నమ్మకం రైతుల్లో వచ్చింది. వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. బ్రాహ్మణపల్లి, భీమేశ్వరా, కరడ్‌పల్లి, కన్‌కల్, కాలోజీవాడి, నందివాడ, ఎర్రాపహాడ్ గ్రామ శివారులోగల వాగులు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని కృష్ణాజీవాడి శివారులో కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై నీరు నిలవడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. తాడ్వాయిలో బాలకిషన్ అనే రైతుకు చెందిన వరిపంట మునిగిపోయింది. తాడ్వాయి మండలంలో బుధ, గురువారాల్లో 6సెం.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఆధ్యాత్మికం

ఘనంగా కొచ్చెరి మైసమ్మ పండుగ



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారంలో గురువారం కొచ్చెరి మైసమ్మ పండుగను ఘనంగా ప్రారంభించారు. గ్రామం నుండి 3 కి.మీ దూరంలో ఉన్న కొచ్చెరి మైసమ్మ ఆలయం వద్ద మహిళలు కాలినడకన వెళ్లి బోనాలు సమర్పించారు. గ్రామస్తులు ప్రతి ఇంట్లో నెలకొల్పి ప్రతి ఏడాది ఆషాఢమాసం శుక్రవారం ప్రతిఒక్కరూ తమ బంధువులను పిలుచుకుంటారు. శుక్రవారం అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సాయిరాం యాదవ్, ఓంట్ల మహేందర్, అల్లం రాములు, మేకల రాములు, పెర్క వెంకటి, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

కామారెడ్డి అర్బన్ : స్థానిక వశిష్ట డిగ్రీ కళాశాల బీకాం (సీఏ) విద్యార్థి సాదియా అఫ్రీన్‌ను కళాశాల యాజమాన్యం సన్మానించింది. టీయూ పరిధిలో మంచి ఉత్తీర్ణత సాధించడంతో పాటు కాగ్నిజెంట్‌లో అత్యధిక ప్యాకేజీతో ఉద్యోగం పొందిన సందర్భంగా గురువారం అభినందించింది. ఈ కార్యక్రమంలో కళాశాల సీఈవో, ప్రిన్సిపాల్‌లు హరిస్మరణ్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థి సాదియాను అభినందిస్తున్న అధ్యాపకులు

సంక్షిప్తం

డీటీగా సంగమేశ్వర్

లింగంపేట(ఎల్లారెడ్డి) : లింగంపేట ఉప తహసీల్దార్‌గా సంగమేశ్వర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. లింగంపేట ఉప తహసీల్దార్‌గా పనిచేసిన చంద్ర రాజేశ్వర్ కలెక్టర్ కార్యాలయం ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంగా పిట్లం నుంచి సంగమేశ్వర్ వచ్చినట్లు తెలిపారు.

బడ్జెట్‌లో రైతాంగానికి పెద్దపీట

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : ఇదిరైతు ప్రభుత్వమని ప్రతిరైతుకు లబ్ధిచేకుర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ బడ్జెట్‌లో రైతులకు పెద్దపేట వేశారన్నారు.ఆరుగ్యారంటీల పథకాల అమలుకు సరిపడా నిధులను కేటాయించడం జరిగిందన్నారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్‌లు, పొల్యూషన్, వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు లేని వాళ్లకు జరిమానాలు వేశారు. ఏఎస్సై సంజీవులు, కానిస్టేబులు, హోంగార్డులు పాల్గొన్నారు.

పోచారం భాస్కర్‌రెడ్డికి సన్మానం



బాన్సువాడ : మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ని గురువారం పలువురు నేతలు బాన్సువాడలో కలిశారు. జన్మదిన వేడుకలకు బాన్సువాడకు రాలేకపోయిన భాస్కర్‌రెడ్డిని పలువురు కులసంఘాల నేతలు, కాంగ్రెస్ కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చీకోటి ప్రవీణ్‌పై చర్యలు తీసుకోవాలి..

మాచారెడ్డి : హైకోర్టు అడ్వకేట్, బహుజన సేన వ్యవస్థాపక అధ్యక్షుడుడాక్టర్ కదిరె కృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చీకోటి ప్రవీణ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని బహుజన సేన జిల్లా అధ్యక్షుడు దేవ సంజీవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రవీణ్ పై మాచారెడ్డి పోలీస్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

రాజంపేట : వికలాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని రాజంపేట మండల వికలాంగుల హక్కుల పోరాట సమితీ నాయకులు గజ్జెల రాజు గురువారం డిమాండ్ చేశారు. సివిల్ సర్వీసెస్ ఉద్యోగాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు ఎందుకు అంటు ఆమె చేసిన వాఖ్యలు సరికాదన్నారు.

విరిగిపడ్డ విద్యుత్‌స్తంభం



మాచారెడ్డి : మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తా లోని అంగడి బజార్‌లో గురువారం ఓ విద్యుత్ స్తంభం విరిగి పడింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి స్తంభం వద్ద మట్టి కొట్టుకుపోయి కుంగిన స్తంభం ఉదయం వీచిన గాలికి విరిగిపడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు.